# నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | VIKARABAD



షాద్‌నగర్ సర్కారు దవాఖానలో వైద్యం కోసం క్యూలో రోగులు

# డబ్బులిస్తేనే ఓపీ.!

- షాద్‌నగర్ సర్కారు దవాఖానలో నయా దందా
- బహిరంగంగా ఓపీకి సొమ్ము వసూలు చేస్తున్న సిబ్బంది
- బాధితులు ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని తెలిపిన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్, డిసెంబర్ 30 : ప్రైవేట్ దవాఖానాల్లో రోగుల నుంచి డబ్బులు తీసుకోవడం సహజం. కానీ షాద్‌నగర్ సర్కారు దవాఖానలో వైద్యం పొందాలంటే రూ.10 చెల్లించి ఓపీ చిట్టీ తీసుకోవాలి. లేకుంటే క్యూలైన్లో నుంచి పక్కకు జరిగిపోవాలి. ఇది ఈ దవాఖానలో సిబ్బంది పెట్టుకున్న రూల్. కండ్ల ముందు బహిరంగంగా రోగుల నుంచి డబ్బులను వసూలు చేస్తున్నా స్థానికంగా ఉండే ఉన్నతాధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని బాధిత రోగులు వాపోతున్నారు. తాజాగా సోమవారం ఉదయం సాధారణ వైద్యం కోసం వచ్చిన రోగుల నుంచి డబ్బులు తీసుకుంటున్న వైనం మరోమారు బయటపడింది. వందల సంఖ్యలో రోగుల తాకిడి ఉండడంతో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. రూ.10 ఉంటేనే క్యూలో ఉండండి.. లేదంటే పక్కకు తప్పుకోండి అంటూ డబ్బులు వసులు చేశారు. అందులో ఓ రోగి ఎక్కడా లేనివిధంగా డబ్బులు ఎందుకు తీసుకుంటున్నారని సంబంధిత సిబ్బందిని ప్రశ్నించగా.. మాకు కూడా ఖర్చులుంటాయని.. మీకు ఓపీ చీటీ కావాలంటే డబ్బులు ఇవ్వండి.. లేకుంటే బయటకు వెళ్లండి అంటూ పెడసరిగా సమాధానమిచ్చారు. ఈ వ్యవహారంపై బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశాడు. సర్కారు దవాఖానల్లో డబ్బులు వసూలు చేయడమేంటని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సంబంధిత దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని వివరణ కోరగా.. బాధిత రోగులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డబ్బులు తీసుకుంటున్నట్లు మీడియాలోనే చూశానని చెప్పారు. ఇదిఇలా ఉంటే సూపరింటెండెంట్ విధులు నిర్వహిస్తున్న గది పక్కనే సిబ్బంది డబ్బులు వసూలు చేస్తుండటం గమనార్హం.

## ఆ పబ్‌లో 8 మందికి డ్రగ్ పాజిటివ్



శేరిలింగంపల్లి, డిసెంబర్ 30 : గచ్చిబౌలిలోని ఓ పబ్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 8 మందికి డ్రగ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధి కొండాపూర్‌లో ఆదివారం రాత్రి క్వాక్ పబ్‌లో టీన్యాబ్, ఎస్వోటీ, గచ్చిబౌలి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 25 మంది నుంచి పోలీసులు డ్రగ్స్ నిర్ధారణ నమూనాలు సేకరించారు. మూత్ర శాంపిల్స్‌లో నలుగురికి, సేలైవా శాంపిల్స్‌లో మరో నలుగురికి మొత్తం 8 మందికి ఈ తనిఖీల్లో పాజిటివ్ నిర్ధారణ అయిందని పోలీసులు తెలిపారు. కొండాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన క్వాక్ పబ్‌లో ఆదివారం రాత్రి బెన్ భూమర్ బ్లూమ్ లైవ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు వచ్చిన వారికి డ్రగ్ తనిఖీలు చేపట్టగా.. పాజిటివ్ నిర్ధారణ అయిందని, పబ్‌లో ఎలాంటి డ్రగ్స్ లభించలేదని పోలీసులు తెలిపారు. పాజిటివ్ వచ్చిన 8 మందిలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. పాజిటివ్ వచ్చిన వారు గంజాయి ఎక్కడ సేవించారు, ఎక్కడి నుంచి కొనుగోలు చేశారనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ 27 సెక్షన్ కింద కేసు నమోదు చేసి నోటీసులు జారీ చేసి దర్యాప్తు చేపడుతున్నారు. నూతన సంవత్సర వేడుకలను దృష్టిలో ఉంచుకొని టీన్యాబ్, ఎస్వోటీ, లా అండ్ ఆర్డర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహిస్తున్న దాడుల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## నూతన సంవత్సర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

### ఎస్పీ నారాయణరెడ్డి



వికారాబాద్, డిసెంబర్ 30 : నూతన సంవత్సర వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేడుకల్లో డీజేలకు అనుమతులు లేవన్నారు. రిసార్ట్స్, ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. నియమ నిబంధనల ప్రకారం వాహనాలు నడుపకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. 31 డిసెంబర్ అర్ధరాత్రి వేళ రేసింగ్‌లు , బైక్ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. 31 డిసెంబర్ సాయంత్రం నుంచి నూతన సంవత్సరం ఉదయం వరకు జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాకాబందీ, వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు ఉంటాయన్నారు. పోలీస్ అధికారులు విధులు నిర్వహించే సమయంలో ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే ఆ సంఘటనల వీడియోలు చిత్రీకరించి కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలకు పోలీస్ డిపార్ట్మెంట్, ఇతర శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా వేడుకల పేరుతో ఇతరులకు ఇబ్బందులు గురిచేస్తే.. వారిపై చర్యలు తీసుకుంటాన్నారు. సంతోషంగా, సురక్షితంగా వేడుకలను తమ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో కలిసి జరుపుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు.

# నమ్మి గెలిపిస్తే.. నట్టేట ముంచారు..!

- కాంగ్రెస్ వైఖరిపై ఫార్మాసిటీ రైతుల ఆవేదన
- నాడు రద్దు చేస్తామన్నారు.. నేడు మొహం చాటేస్తున్నారు..
- పదవుల కోసమే పాదయాత్రలు.!

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దుచేస్తాం. ఇంకా సేకరించాల్సిన భూములను తీసుకోకుండా చూస్తాం. సేకరించిన భూమిని అవసరమైతే రైతులకు తిరిగి అప్పగిస్తాం.. అని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు గతంలో ఫార్మా బాధిత గ్రామాల రైతులు, ప్రజలకు హామీ ఇచ్చారు. ఆ పార్టీ నాయకులు అనేక మంది ఫార్మా బాధిత గ్రామాల్లో పాదయాత్రలు సైతం చేశారు. పాదయాత్రల ద్వారా ప్రజలను కలుసుకున్నారు. ఫార్మా ఏర్పాటు చేస్తే జరిగే అనర్థాలపై వారికి వివరించారు.

- రంగారెడ్డి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)


ఎన్నికలకు ముందు ఫార్మాసిటీకి వ్యతిరేకంగా చేస్తున్న పాదయాత్రలో ప్రస్తుత మంత్రులు భట్టి, సీతక్క తదితరులు(ఫైల్)

### నిరాశే మిగిలింది..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే ఫార్మాసిటీ రద్దవుతుందని తమ భూములు తమ వద్దే ఉంటాయని నమ్మిన బాధిత గ్రామాల ప్రజలకు తీవ్ర నిరాశ మిగిలింది. ప్రభుత్వం ఫార్మా ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి తీసివేసి తమ పేర్ల మీదకు మార్చాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. మరోవైపు పర్యావరణ పరిరక్షకురాలు ఆవుల సరస్వతి ఫార్మాసిటీని ఏర్పాటు చేయవద్దని, భూములివ్వకుండా నిరాకరించిన రైతుల భూములు తీసుకోవద్దని ఆమె ఆధ్వర్యంలో బాధిత గ్రామాల్లో పర్యటించి చైతన్యం తీసుకొచ్చే కార్యక్రమాలు చేపడుతున్నారు.

### భూములపై నిషేధాన్ని ఎత్తివేయాలి

ఫార్మాసిటీ ఏర్పాటుకు యాచారం మండల పరిధిలోని కుర్మిద్ద, తాటిపర్తి, నానక్‌నగర్, మేడిపల్లి గ్రామాల్లో అనేక మంది రైతులు తమ పట్టా భూములివ్వడానికి నిరాకరించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ తమ భూమిలిచ్చేది లేదని మొండికేయడంతో అప్పటి ప్రభుత్వం వారి భూములను తీసుకోలేదు. పైగా భూములకు పరిహారాన్ని పెంచుతామని ప్రకటించినా రైతులు ససేమిరా అన్నారు. ఆ తర్వాత భూమిలివ్వని రైతుల భూములను ప్రభుత్వం నిషేధిత జాబితాలోకి చేర్చింది. ఈ నిషేధిత జాబితాలో మేడిపల్లిలో 483 ఎకరాలు, నానక్‌నగర్‌లో 154, తాటిపర్తిలో 382, కుర్మిద్దలో 974ఎకరాలు పట్టా భూములున్నాయి. ఆ భూములకు సంబంధించిన పరిహారాన్ని కూడా కోర్టులో జమ చేశారు. సుమారు 1,500 నుంచి 2,000 మంది రైతులు పట్టా భూములు కలిగి ఉన్నారు. తమ భూములివ్వనందుకు వాటిని నిషేధిత జాబితాలో పెట్టడం సమంజసం కాదని పలువురు రైతులు కోర్టును ఆశ్రయించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే తమ భూములు తమ కొస్తాయని, ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటు కాదని నమ్మిన రైతులు గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి జైకొట్టి భారీ మెజార్టీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయకులు మొహం చాటేయడంతోపాటు తమ భూములపై నోరు మెదపడంలేదని రైతులు వాపోతున్నారు. వెంటనే తమ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని కోరుతున్నారు.

### పాదయాత్ర చేసిన వారందరికీ పదవులు..

ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోసి ఫార్మా బాధిత గ్రామాల్లో పాదయాత్రలు జరిపిన నాయకులందరికీ ప్రస్తుతం పదవులు దక్కాయి. పదవులు పొందిన తర్వాత వారు తమ వైపు కన్నెత్తి చూడడంలేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సెప్టెంబర్ 19, 2020లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌కు చెందిన నాయకులు ప్రస్తుత ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా యాచారం మండల పరిధిలోని మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద గ్రామాల్లో ఫార్మాకు వ్యతిరేకంగా పాదయాత్ర నిర్వహించారు. ప్రస్తుతం వీరంతా రాష్ట్ర మంత్రివర్గంలో కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్యే యాచారం ప్రాంతానికి చెందిన కోదండరెడ్డి కూడా గతంలో ఫార్మాకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన రైతు సంఘం చైర్మన్‌గా ఉన్నారు. కోదండరాం కూడా ఈ ప్రాంతంలో పర్యటించి ఫార్మాకు వ్యతిరేకంగా అనేక సమావేశాలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్సీగా ఉన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఫార్మా బాధిత గ్రామాల్లో పలుమార్లు పర్యటించి ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.

### ఫార్మాసిటి వద్దు.. వ్యవసాయమే ముద్దు

**యాచారం :** మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన ఫార్మా బాధిత రైతులు సోమవారం ర్యాలీ చేపట్టారు. ఫార్మా వద్దంటూ వ్యవసాయమే ముద్దంటూ నినాదాలు చేశారు. ఫార్మాసిటి ఏర్పాటుతో కలిగే అనర్థాలపై ప్రజలకు, రైతులకు వివరించారు. ఇటీవలే రైతులు పటాన్‌చెరు, గడ్డపోతారం, పాశమైలారం, కిష్టయ్యపల్లి, బొల్లారం గ్రామాల్లో ఏర్పాటైన ఫార్మా కంపెనీలపై బస్సు యాత్ర ద్వారా నాయకులు, రైతులు అధ్యయనం చేశారు. అనంతరం గ్రామస్తులకు ఫొటోల రూపంలో అవగాహన కల్పించారు. భూ కాలుష్యం, నీటి కాలుష్యం, వాయు కాలుష్యం ఏర్పడి మానవ మనుగడ కష్టంగా మారుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందిచ్చిన హామీ ప్రకారం యాచారం మండలంలో ఫార్మాసిటీని రద్దు చేయాలని కోరారు. ఫార్మాకు భూములివ్వని రైతుల పేర్లు ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. ఫార్మాను రద్దు చేసేదాకా పోరాడుతామని వారు పేర్కొన్నారు.పోలీసుల అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించొద్దని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని నాయకులకు సర్దిచెప్పారు. శాంతియుతంగా ఫార్మా రద్దు కోసం పోరాడుతామని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి సమన్వయకర్తలు కవుల సరస్వతి, సామ నిరంజన్, కానమోని గణేశ్, కుందారపు సత్యనారాయణ, మహిపాల్‌రెడ్డి, దేవోజీ, వినోద్‌రెడ్డి, అనసూయ స్పష్టం చేశారు.



యాచారం మండలం తాటిపర్తిలో ఫార్మాసిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న నాయకులు, రైతులు

# ఆర్భాటం ఎక్కువ.. అమలు తక్కువ..

కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆర్భాటం తప్ప ఏ ఒక్క నిర్ణయమూ అమలుకు నోచుకోవడంలేదు. రుణమాఫీ విషయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు చేయకుండానే పూర్తి చేశామంటూ ప్రచారం చేసుకోవడం తప్ప అర్హులుగా గుర్తించిన వారికి అన్యాయం చేస్తున్నది. ఎన్నికలకు ముందు ఒకే దఫాలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే రేషన్ కార్డులను పరిగణనలోకి తీసుకోవడం, తదితర కొర్రీలు పెట్టి అర్హులైన పేద రైతులకు రుణమాఫీ వర్తించకుండా రేవంత్ సర్కార్ దగా చేసింది. రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేశామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటుండగా.. కేవలం రూ.1.50 లక్షల వరకు మాత్రమే పూర్తయింది. నాలుగో విడత రుణమాఫీకి సంబంధించి అర్హుల జాబితాను జిల్లా వ్యవసాయాధికారులు విడుదల చేసి నెల రోజులు దాటుతున్నా సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో మాత్రం ఇంకా రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. తమ రుణాలు ఎప్పుడు మాఫీ అవుతాయంటూ సంబంధిత రైతులు వ్యవసాయాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇదే విషయమై వ్యవసాయాధికారులను వివరణ కోరగా.. త్వరలో మాఫీ డబ్బులు జమవుతాయంటూ చెబుతున్నారే తప్ప ఎప్పుడనేది ప్రభుత్వం నుంచి స్పష్టత లేదనటం గమనార్హం. ఇప్పటివరకు రూ.1.50 లక్షల రుణాలలోపు ఉన్న రూ.750 కోట్ల రుణాలను మాఫీ చేయగా, నాలుగో విడతలో రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షలలోపు రుణాలున్న మరో 10,660 మంది రైతులకు సంబంధించిన రూ.98.17 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉన్నది.

- వికారాబాద్, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ)


- ఇంకా జమకాని నాలుగో విడత రుణమాఫీ రూ.98.17 కోట్లు
- ఈ విడతలో మిగిలి ఉన్న రైతులు 10,660
- జిల్లాలో రూ.2లక్షలలోపు రుణమాఫీకి 1,01,278 మంది రైతులు అర్హులుగా గుర్తించిన సర్కారు
- రూ.2లక్షలలోపు రుణమాఫీ పూర్తయిందంటూ ప్రభుత్వం ప్రచారం
- ఇప్పటివరకు రూ.1.50 లక్షల వరకే రుణమాఫీ పూర్తి
- రూ.849 కోట్లకు ఇప్పటివరకు ఇచ్చింది రూ.750 కోట్లే..
- రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీపై ఇంకా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- రెండు నెలలపాటు సేకరించిన గ్రీవెన్స్ దరఖాస్తుల్లో ఒక్క దరఖాస్తుకు కూడా పరిష్కారం చూపని సర్కారు

### కటాఫ్ రుణాన్ని చెల్లించినా..

పట్టాదారు పాసుపుస్తకాలను కాకుండా రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకోవడంతో చాలా మంది అర్హులైన రైతులు నష్టపోయారు. అదేవిధంగా రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలను ఆగస్టు 15లోగా చెల్లిస్తేనే రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయాధికారులు చెప్పడంతో సుమారు 2 వేల మంది రైతులు చెల్లించారు. సంబంధిత రశీదులను వ్యవసాయాధికారులకు అందజేసినప్పటికీ ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు కట్టి 4 నెలలైనా ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు రుణాలను మాఫీ చేస్తున్నామంటూనే తిరిగి రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికి ఇప్పుడు నట్టేట ముంచుతుండడంపై రైతులు సర్కారుపై తీవ్ర అసంతృప్తి వెల్లగక్కుతున్నారు. మరోవైపు రుణాలు రూ.2లక్షల పైచిలుకు ఉన్న రైతులు మిగతా రుణాలను చెల్లించేందుకుగాను వడ్డీ వ్యాపారులను ఆశ్రయించారు.

### గ్రీవెన్స్‌లో ఒక్క దరఖాస్తును కూడా పరిష్కరించని ప్రభుత్వం

మరోవైపు రెండు నెలలపాటు సేకరించిన రుణమాఫీ గ్రీవెన్స్‌లో ఒక్కటంటే ఒక్క దరఖాస్తును కూడా ప్రభుత్వం పరిష్కరించలేదు. జిల్లావ్యాప్తంగా గ్రీవెన్స్‌కు సంబంధించి దాదాపు 30 వేల వరకు రైతులు రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేశారు. అందులో 18,431 మంది రైతులకు రేషన్ కార్డు లేకపోవడంతోనే రుణమాఫీ కాలేదని వ్యవసాయాధికారులు ఇచ్చిన సర్వేలో వెల్లడైంది. అత్యధికంగా నవాబుపేట మండలంలో రెండు వేల మందికిపైగా రైతులు ఫిర్యాదు చేశారు. జిల్లావ్యాప్తంగా 2.50 లక్షల మంది రైతులుండగా.. సుమారు 2 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకోగా.. వీరిలో కేవలం 1.01 లక్షల మంది రైతులను మాత్రమే రూ.2 లక్షలలోపు రుణమాఫీకి అర్హులుగా కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది.


వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు




# సరికొత్త ఆశలు..!

**రేపే నయా సాల్**

- కొత్త నిర్ణయాలతో టైం టేబుల్స్
- గత ఫెయిల్యూర్స్ కొనసాగకుండా
- న్యూ ఇయర్ రెసొల్యూషన్స్‌తో అనేక లక్ష్యాలు
- నేడు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి 1 వరకు ఉచిత వాహన సేవలు
- తెలంగాణ ఫోర్ వీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహణ

సిటీబ్యూరో, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : మరో కొన్ని గంటల్లో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతున్నాం. 2024కి వీడ్కోలు పలుకుతూ సరికొత్త ఆశలతో 2025ను ఆహ్వానించబోతున్నాం. ఈ మధుర క్షణాలను ప్రతి ఒక్కరూ ఎంతో వైభవంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. కొందరూ కుటుంబ సమేతంగా వేడుకలు ఏర్పాటు చేసుకుంటే.. మరికొందరు స్నేహితులతో రిసార్టులు, ఈవెంట్ వేడుకలకు వెళ్లడానికి రెడీ అయ్యారు. మొత్తంగా నగరం కొత్త ఏడాది ఉత్సవానికి సిద్ధమైంది. సాయంత్రం నుంచే '31' సంబురాలు ఊపందుకోనున్నాయి. గడిచిన క్షణాల నుంచి మంచిని తీసుకొని రాబోయే కాలంలో విజయాల వైపు నడిచేందుకు 'న్యూ ఇయర్ రెసొల్యూషన్స్'లో భాగంగా వారి డైరీలో ప్రణాళికలు రాసుకుంటున్నారు. ఇప్పటివరకు చేయాలనుకున్నవి చేయలేకపోవడానికి కారణాలను పరిశీలించుకొని ఇకపై వచ్చే రోజుల్లో అన్ని సక్రమంగా చేసుకునేలా తమకు తాము సూచనలు చేసుకుంటున్నారు. కొందరు ప్రతి రోజూ ఉదయం వాకింగ్ చేయడం, ఇంకొందరు జిమ్‌కు వెళ్లడం, మరికొందరు పుస్తకాలు చదవడం, కొత్త భాషలు నేర్చుకోవడం, ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వడం తదితర లక్ష్యాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఈ ఏడాదిలోనైనా ఏర్పాటు చేసుకున్న లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేస్తామని వారికివారుగా సోషల్ మీడియాలో పోస్టులు కూడా పెడుతుండటం విశేషం.

### ఉచితంగా రవాణా సేవలు


తెలంగాణ ఫోర్ వీలర్ డ్రైవర్స్ ఆధ్వర్యంలో 'హమ్ ఆప్కే సాథ్ హై' థీమ్‌తో మద్యం సేవించి వాహనం నడపకూడదని క్యాంపెయిన్ జరుగుతున్నది. డిసెంబర్ 31 రాత్రి హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పరిధిలో 500 కార్లు, 250 బైక్ టాక్సీలు ఉచితంగా రవాణా సేవలందిస్తాయని నిర్వాహకులు తెలిపారు. 31న రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి 1 వరకు సేవలందుబాటులో ఉంటాయని చెప్పారు. 9177624678కు ఫోన్ చేసి డ్రాపింగ్ వివరాలు తెలుపాలన్నారు

### నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

కొత్త ఏడాది సందర్భంగా మూడు కమిషనరేట్ల పరిధిలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా రాత్రి 10 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు ఎయిర్‌పోర్టుకు వెళ్లే వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. పీవీఆర్ ఎక్స్‌ప్రెస్ వే మార్గాన్ని కూడా మూసివేయనున్నట్టు తెలిపారు. రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల వరకు విమానాశ్రయం వెళ్లే వాహనాలకు మినహా మేరే ఇతర వాహనాలకు అనుమతి లేదని పేర్కొన్నారు. ఈ మార్గాల్లో వెళ్లే వాహనదారులు, డ్రైవర్లు డ్రెస్ కోడ్, రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు పాటించకుండా వ్యవహరించే వాహనదారుల సమాచారం 94906 17646 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. నగరంలో బేగంపేట, టోలిచౌకి మినహా అన్నీ ఫ్లై ఓవర్లు మూసివేయనున్నట్టు తెలిపారు. ప్రైవేట్ బస్సులు, లారీలు, హెవీ గూడ్స్ వాహనాలను రాత్రి 10 నుంచి ఉదయం 2గంటల వరకు అనుమతించబోమని చెప్పారు.

# శివారు చెరువులపై హైడ్రా చూపు..

- తుర్కయాంజాల్ మాసబ్ చెరువు, కుంట్లూరు బత్తుని చెరువును పరిశీలించిన అధికారులు


తుర్కయాంజాల్ మాసబ్ చెరువును పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

రంగారెడ్డి, డిసెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ శివారుల్లోని రంగారెడ్డి జిల్లా పరిధిలోగల పలు చెరువుల ఆక్రమణపై హైడ్రా దృష్టి సారించింది. అందులో భాగంగా సోమవారం జిల్లా పరిధిలోని తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోగల మాసబ్ చెరువును, అలాగే.. పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూరు బత్తుని చెరువును ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. మాసబ్ చెరువును హైడ్రా అధికారులు ఇప్పటికే రెండుసార్లు పరిశీలించి ఆక్రమణలపై లోతుగా విచారణ జరుపుతున్నారు. మాసబ్ చెరువు విస్తీర్ణం 495 ఎకరాలు, ఇందులో ప్రభుత్వ భూమి 300 ఎకరాలకు పైగా ఉండగా, పట్టా భూములు 150 ఎకరాల వరకున్నాయి. ఇందులో అత్యధికంగా శిఖం, బఫర్‌జోన్ పరిధిలోనే ఉన్నాయి. కాని, ఈ చెరువులో శిఖం భూమితోపాటు శిఖం పట్టాలు కూడా పెద్దఎత్తున ఆక్రమణకు గురైనట్లు హైడ్రా దృష్టికి వచ్చింది. ఈ చెరువు పరిధిలోని శిఖంలో పెద్దఎత్తున ఇండ్ల నిర్మాణం జరుగగా, మరో చోట రోడ్డును కూడా వేశారు. దీనిపై హైడ్రా అధికారులు పూర్తి వివరాలు సేకరించారు. అలాగే, కుంట్లూరు గ్రామంలోగల బత్తుని చెరువు కూడా ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు అందింది. దీంతో హైడ్రా విచారణ అధికారి బాసిరెడ్డి, ఇరిగేషన్ డీఈ చెన్నకేశవ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాసబ్ చెరువు వద్దకు కాలనీల ప్రజలు వచ్చారు. దీనిపై ఎవరికైనా అభ్యంతరాలుంటే తమ వినతులను హైడ్రా కార్యాలయంలో అందించాలని సూచించారు. ఆక్రమ నిర్మాణదారులకు త్వరలోనే నోటీసులిచ్చే అవకాశాలున్నట్లు తెలిసింది.